


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**"మాకు తెలిసిన కుటుంబాలలో** ఒక ఇంట్లో జరిగిన సంఘటన. అది చెబితే మీకు వినోదమే కాక విచారమూ కలగవచ్చు. ఇది నా కార్యాలయ హంసగీతం. ఇది పాడి నేను మరణిస్తాను అని నా ఉద్దేశం కాదు. ఒక ఉద్యోగినిగా మాత్రం అవతారం చాలిస్తాను. గృహిణిగా కొనసాగుతుంటాను. చెప్పాలా ఒద్దా? ఇందులో బూతుండదు. బూతుకు మాత్రం సంబంధించినదే. పెద్ద కథ కాదు. నాలుగు వాక్యాలలో అంతరించేది. మన విరామ సమయమూ అయిపోబోతోంది. ఈ రోజైనా నెను టైముకు నా సీటుకు వెళ్ళాలి."

"చెప్పు."

"మా బంధువు తన కార్యాలయంలో భోజనాల వేళ బూతు కథలు చెప్పి వయసుపైబడిన పురుషులను కూడా లొట్టలు వేయిస్తూ ఉండేవాడు. సహోద్యోగులు గుమ్మికూడేవాళ్లు; చెప్పిన కథలే చెబుతున్నా కొత్తకథలా వింటుండేవాళ్ళట, మా ఆయన చెప్పాడు."

"మీ వారు ఆ చెప్పినాయననుంచీ విన్న కథలు నీకు చేరవేసేవారా ఏమిటి?" సీతమ్మ అంది.

"నన్ను చెబుతున్నది చెప్పనిస్తావా లేదా ?"

"అయినా అధికారుల భార్యలు కొందరు ఎవరో ఒకరి ఇంట్లో చేరి నీలిచిత్రాలు చూస్తుండగా, సామాన్యులమైన మనం కేవలం కథలు చెప్పుకుని నవ్వుకోడంలోతప్పు లేదు."

"ఆ వ్యక్తి చెప్పిన కథకు ప్రతిసారీ కొత్త వన్నె చిన్నెలు చేకూర్చి నవ్విస్తూ ఉండేవాడట. ఆయన నడుస్తుంటే కొందరు పరిహాసంగా అంటుండేవారట – నీవు నడుస్తుంటే బూతు నడుస్తున్నట్టుంది అని; నవ్వితే బూతు నవ్వినట్టుంటుందని; మాట్లాడితే బూతుకు నోరొచ్చినట్టుంటుందని. అతని పడక గదిలో ఎంత శృంగార సామర్థ్యం ఉందొ మనకు తెలియదు.

భార్యనడిగితే చెప్పేదేమో. సరే ఆ విషయం వదిలేద్దాం. అతను పదవీ విరమణ చెయ్యబోతుండగా అనుకోని సంఘటన అతని జీవితంలో జరిగింది. అతని భార్య వరుస, వావీ లేని, బాగా వయసు తక్కువ బంధువుల కుర్రాడిని మరిగింది. పెద్దాయన కొన్నాళ్ళు వేరే ఇంట్లో బతికాడు, తరువాత పోయాడు. నీతి: బూతును ప్రేమించినవాడు బూతు పనికి బలవ్వవచ్చు."

బంట్రోతు వచ్చి సుమతితో "అయ్యగారు పిలుస్తున్నారమ్మా" అన్నాడు.

ఆమె లేవకుండా కూర్చుండిపోయింది. అంతమంది అక్కడుండగా తానూ వెళ్ళిపోతే తన గురించీ సంభాషించుకుంటారు. ఆలస్యంచేస్తే అతగాడు మండిపడతాడు, కోపమొచ్చిన పశువులా. ఇంతలో ప్రియదర్శిని లేచి నిలబడింది సుమతి ఇబ్బందిని అర్థం చేసుకున్నట్టు. ఆమెతోబాటూ మిగతా వాళ్ళూనూ గుంపుగా బయలుదేరారు. ప్రియదర్శిని అటూ ఇటూ ఉన్నవాళ్లు ఆప్యాయంగా ఆమె భుజాలమీద చేతులు వేసి నడుస్తున్నారు. వాళ్ళతో కలిసి వెళ్ళింది సుమతి.

జనాలలనుంచీ బైటికి వచ్చి కారిడార్లో నడుస్తుంటే అది గాజు పెంకులు, ముళ్లకంపలు ఉన్న దారిలా అనిపించింది. భూగర్భంలోకి సొరంగంలా కూడా అనిపించింది. విద్యుత్తూ లేదు. ముందు మరుగుదొడ్లోకి వెళ్లి పని కానించుకుని అద్దంలో మొహం చూసుకుంది. అది పేలవంగా ఉంది. ఉద్యోగం మానెయ్యడమే ఉత్తమం అని చాలాసార్లు అనిపించింది. కుక్క ఎముకలను తేలిగ్గా కనుగొనగలిగినట్టు, రాయుడు తప్పులను తేలిగ్గా వెలికి తీయగలడని ఆమెకు అనిపించింది. మిగతా వాళ్ళ పనులమీద గుడ్డి సంతకాలుపెట్టి తన ఒక్క దాని పనిమీద తన సకల నేత్రాలనూ పురమాయిస్తాడేమో, ఇంద్రుడికి ఒళ్ళంతా కళ్లంటారు; అవి కళ్ళు కాదు లైంగిక అంగాలు అంటారు మరికొందరు; ప్రియదర్శిని గారిని కనుక్కోవాలి సాయంత్రం తీరిగ్గా. అహల్య, ఇంద్రుడి మధ్య జరిగిన అసలు వ్యవహారం కూడా ఆమెను అడిగి తెలుసుకోవాలి. అతని గదిలోకి ధైర్యంగా వెళ్ళింది .అతని ముఖం ప్రశాంతంగా వుంది. అరనిమిషం అతను మాట్లాడకపోవడంతో ధైర్యంచేసి అతని బల్లకు ఇటుగా వేసిన కుర్చీలలో ఒకదాంట్లో కూర్చుంది. కళ్ళెత్తి ఆమెను చూశాడు. పైకి మాత్రం కప్పను మింగబోయే పాములా ఉన్నాడు. మొహాన్ని భావరహితంగా ఉంచుకున్నాడు. మింగడానికి భావంతో పనిలేదు. భుజాలనిండుగా పవిటను కప్పుకుంది.

"మీరు దీన్ని లాటిన్ లో రాశారా, గ్రీకులోనా?" అన్నాడు తాను చూస్తున్న కాగితాన్ని చూపుడు వేలుతో పొడుస్తూ. "ఎంతచదివినా బోధపడటంలేదు; నాకు ఆంగ్లం మాత్రమే తెలుసు తెలుగుతోబాటు."

ఆమె ఏ సమాధానం చెప్పడానికి వీలుంది? ఊరుకుంది. పాము ఎలాగూ మింగక తప్పనపుడు బెకబెకలాడటం కంఠ శోష. అతను దస్త్రం తనదగ్గిరే ఉంచుకుని దాని మీది కాగితాన్ని విసిరినట్టు ఆమె దగ్గిరకు తోశాడు. చదివింది. సరిగ్గా రాయలేదు. వాక్యనిర్మాణంలో తప్పులున్నాయి. అక్షర దోషాలూ రెండున్నాయి.

"మళ్ళీ రాసి తీసుకొస్తాను."

"మీలాంటి వాళ్ళు నా కింద అనేకులు పనిచేస్తున్నారుకదా, వాళ్ళు చేసే రాత తప్పులను అయ్యవారిలా నేను దిద్దుకుంటూ కూర్చోవాలా?" గొంతు రెట్టించి అన్నాడు.

ఆ స్వరం చాలా కర్కశంగా ఉంది. తనదగ్గిరున్న దస్త్రాన్ని బల్లమీది నుంచే ఆమె వైపు గట్టిగా తోసేశాడు. అది వచ్చి ఆమె వక్షానికి తగిలింది. ఆమె ఉద్రేకం కట్టలు తెంచుకుంది. రాయుడిని చంపాలన్న తీవ్రత మాత్రం లేదు. అందుచేత కుర్చీలోనుంచీ చివాలున లేచి దాన్ని వెనక్కు బర్రున జరిపి ముందు అతనికి ఇచ్చిన కాగితాన్నీ, తోసిన దస్త్రాన్ని అతని బల్లమీదే ఒదిలి గదిలోనుంచీ రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది. ఆమె ముఖంలోకి చూసినపుడు దాని తీవ్రత అతన్ని భయపెట్టింది. తనమీద ఫిర్యాదుకు పూనుకుంటుందా; సహచరులతో తనపై దాడిచేయిస్తుందా? మితిమీరాడు. ఏమి చేసేదిప్పుడూ?

ఆమె తన సీటుకు వచ్చి వారంరోజులు శలవు చీటీ రాయాలా, రాజీనామా లేఖ రాయాలా అన్న మీమాంస రెండు నిమిషాలు చేసి – ముందు శలవు చీటీ రాసిచ్చి తరువాత రాజీనామా లేఖను పంపవచ్చని మొదటి లేఖను రాసింది. తనపై ఉండే మొదటి అధికారికి ఆ కాగితం ఇచ్చి ఒంట్లో బాగాలేదని ఇల్లు చేరింది. తలనొప్పి తీవ్రంగా వచ్చింది. మంచం మీద పడుకుంది. కృపా ఊళ్ళో లేడు. నిద్రపట్టింది. మెలకువ వచ్చినా మంచం మీదే ఉండిపోయింది. పనిమనిషి దొంగలా ఆమె గదిలోకి వచ్చి ఆమెను చూస్తుండటం గమనించింది సుమతి.

"ఏం, మరిడమ్మా?"

"ఎవరో వచ్చారమ్మ మీ గురించీ."

టైం చూస్తే ఆరుగంటలు. ఆతను వచ్చాడా అనుకుంది. మరిడమ్మకు తెలిసినవాళ్లయితే ఫలానా అని చెప్పుండేది. తెలిసుండకపోతే ఏమిచెప్పగలదు? వెంటనే మంచం మీద కూర్చుంది. స్నానాల గదిలోకి వెళ్లి అద్దంలో మోహం చూసుకుంది. కాటుక కనురెప్పపైన చెంప దిగువున అలుముకుని ఉంది. జుట్టు చెదిరి వుంది నిద్రవలన. కొన్ని గంటల క్రితం అయిన అనుభవంవలన మోహం మలినంగానూ పీక్కుపోయి ఉంది. చీర నలిగుంది. ముందు జుట్టు సవరించుకుని, మొహం కడుక్కుని చీరమార్చుకుని వెళదామనుకుంది. క్షణంలో మనసు మార్చుకుంది; దానికి కారణం ఉంది. డ్రాయింగ్ రూములోకి వచ్చింది. అతను తలొంచుకుని నిలబడున్నాడు.

"కూర్చోండి," అంది వినీవినబడనట్టు.

రాయుడు కూర్చున్నాడు. ఆమెకూడా ఎదురుకుర్చీలో ఒదిగి కూర్చుంది పూవు మొగ్గయినట్టు. ఎన్ని సిగరెట్లు తాగాడోమారి వాటి కంపు కొడుతున్నాడు. ఆ కంపు తాగుడు వాసనతో మేళవమయుంది. తల చిందరవందరగా ఉంది. నీలం తెలుపుల గళ్ళ చొక్కావేసుకుని ఉన్నాడు.

"ఆవేశంలో హద్దుమీరాను. క్షమించండి. ఇది చెప్పడానికే ఒచ్చా."

ఆమె ఏమీ మాట్లాడలేదు. గుండెలోని గాయం ఇంకా పచ్చిగా ఉంది. అతని మాటలు లేపనామా? ఫరవాలేదు అని అనడానికి వీలవడంలేదు. చేసింది పెద్ద చెడ్డపని; అతని కాలితో తనను తన్నినంతపని. తప్పయింది అని ఒప్పుకుంటే అవి ఊరటమాటలా? మౌనంగా ఉండిపోయింది.

"శలవు పెట్టారని తెలిసింది. రేపటి నుంచీ కార్యాలయానికి వచ్చేయండి. మిమ్మల్ని ఇక పిలువను" నేలచూపులు చూస్తూ అన్నాడు.

"రాజీనామా చేద్దామన్న నిర్ణయానికి వచ్చాను."

అతను మౌనంగా ఉన్నాడు. ఏమనాలో అతనికి తోచలేదు. అనాలనున్న మాటలను అనాలా వద్దా అన్న సందిగ్ధంలో ఉన్నట్టు. కొన్నినెలలుగా అతన్ని ఆమె దగ్గిరగా చూస్తూ వచ్చింది; పులి అవతారంలో అతన్ని చూస్తూ వచ్చింది. ఇప్పుడు అది గోవయింది. ఆ రెండిట్లో ఏది నిజస్వరూపం? ఒకే నాణానికి ఉండే రెండు వైపులలా ఒకవైపు పులి, మరో వైపు గోవేమో. అసలు స్వభావం దుర్మార్గమైనది. పిలువను అంటున్నాడు. తనకు కావాలిసిందీ అదే. నిజస్వరూపం ఎలాంటిదైనా అతని దగ్గరకు వెళ్ళవలసిన అవసరం లేకపోతె ఇంకేమి కావాలి?

"మరిడమ్మా, అయ్యగారికి టీ తెస్తావా?"

"ఆవేశం తగ్గినతరువాత తీరుబడిగా ఆలోచించండి రాజీనామా విషయం. అది తెలివైన పని కాదని మీకే అనిపిస్తుంది. పని ఒత్తిడిసంగతి మీకు తెలుసుగా? దాన్ని తట్టుకోలేక సిగరెట్లు తాగడం మందుకొట్టటమే కాక, పిచ్చిపనులు చేస్తుంటాను," అన్నాడు.

గళ్ళ చొక్కాలు వేసుకోమని కృపకు చెబుతుంటుంది. దుస్తులపై శ్రద్ధ అతనికి లేదు.

ఆమె అతనిగది నుంచీ వెళ్ళిపోయినా తరువాత ఎలాంటి ఉద్రిక్తపరిస్థితిని ఎదుర్కొనవలసి వస్తుందో అని భయపడ్డాడు. రెండు నిముషాలు కదలకుండా కుర్చీలో ఉండిపోయాడు విద్యుద్ఘాతం తగిలినట్టు. నాలోని కామం ప్రకోపించి ఇలాంటి పరిస్థితికి తనను తెచ్చిందని అనుకున్నాడు. మనస్తత్వపరంగా ప్రతి మనిషీ కుక్కతోకలాంటి వాడే. తేరుకున్నాడు. బంట్రోతును పిలిచి "సుమతీ మేడంను అడిగి ఈ దస్త్రం తీసుకురా" అన్నాడు ఒక కాగితం మీద దాని సంఖ్యను వ్రాసి. వాడు క్షణంలో వచ్చి ఆమె శలవు పెట్టి ఇంటికి వెళ్లిపోయిందని చెప్పాడు. కొంచం ఊపిరి పీల్చుకున్నాడు. కానీ భర్తతో జరిగిన విషయం చెప్పి పైవాళ్ళ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయకూడదని లేదు. అందుకే ఆఫీసు అయినవెంటనే ఆమె ఇంటికి బయలుదేరాడు చిరునామా కనుక్కుని. తాను ఇంటికి రాంగానే తనపై విరుచుకుపడకపోవడం కాస్త సంతోషాన్నిచ్చింది.

"మీ పని ఒత్తిడికి నన్ను బలితీసుకుంటాననంటే ఎలా?"

ఇంతవరకూ అతనితో కార్యాలయంలో అంత ధైర్యంగా మాట్లాడలేదు. కార్యాలయంలోని పులి పిల్లిగా మారి ఆమె ఇంట్లో దూరింది, ముద్దుచేయడానికి వీలుగా.

"అది అలా జరిగిపోయింది అనాలోచితంగా. మిమ్మల్ని బలి తీసుకోవడం నా అభిమతం కాదు. కారణం చెప్పాను."

"నా ఒక్కదానిపట్లే మీరు అలా ప్రవర్తిస్తున్నారన్న విషయం మీకూ తెలుసు. నా నుంచీ మీరు ఏమి ఆశిస్తున్నారో తెలియని బాలను కాదు."

"మీ నుంచీ నేను ఏమి ఆశిస్తానండీ? మా ప్రేమలత మరొక స్త్రీని కంటితో చూస్తే ఊరుకోదు; తాను మరొక పురుషుడిని చూడదు."

ప్రేమలత గురించీ కార్యాలయంలో ఏమని చెవులు కొరుక్కుంటుంటారో సుమతికి తెలుసు.

మరిడమ్మ టీ కప్పుల ట్రేతో వచ్చింది. ఒకకప్పు తానే తీసి అతని ముందుంచి తీసుకోమనింది సుమతి. తానొకటి తీసుకుని చప్పరించడం మొదలుపెట్టింది. అతనూ ఆ పని చేయబోయి పెదవులు కాలి టీపాయిమీది కప్పును తిరిగి ఉంచాడు.

"మీరు చాలా వేడిగా తాగగలరే!" అన్నాడు.

అవునన్నట్టు కనురెప్పలతో చెప్పింది టీ తాగడం ఆపకుండా.

"టీ చాలా బాగుంది. మా ప్రేమలత ఇంత బాగా పెట్టలేదు."

"మరిడమ్మ బాగాపెడుతుంది.

"శలవు రద్దుచేసుకుని ఆఫీసుకు యథావిధిగా వచ్చెయ్యండి; మిమ్మల్ని నా గదికి పిలవను," మరోమారు అన్నాడు.

ఐదునిమిషాలు తరువాత లేచిపోయి, వస్తానని చెప్పి, వరండాలోకి నడిచాడు. అతనికంటే ఆమె ముందుగా వెళ్లి, గడియ ఎత్తి, గేటును తెరిచింది. అతను కార్లో కూర్చునేవరకూ నిలబడింది.

"మీరు శలవు రద్దుచేసుకుంటున్నట్టే కదా?"

సమాధానం చెప్పలేదామె. ఆమె మౌనంలో అతనికి కావలసిన సమాధానం దొరికింది. అతను కారు కదిలేవేళ చేతిని చూపాడు. ఆమె శిలలా నిలబడివుంది. అరె ఇంత చీకటిపడిపోయిందేమిటీ నేను గమనించకుండానే అనుకుంది. చీకటి చాపకింద నీరులా చేరుతుంది. ఒక్కసారి వచ్చి కూర్చోదు. ఏదో విచారం వీచికలా వీచి వెళ్ళిపోయింది మనసునుంచి. లోపలకు వచ్చి తిరిగి ఇందాక తాను కూర్చున్న సోఫాలో కూర్చుండిపోయింది అతను ఖాళీచేసి చోటును చూస్తూ.

మరుసటిరోజు ఆఫీసుకు హాజరయ్యింది. అతను ఆరోజే కాక ఐదు రోజులపాటు పిలవలేదు. మాటకు కట్టుబడ్డట్టున్నాడు అనుకుంది. ఆరో రోజు పిడుగులాంటి వార్త వచ్చింది. ఆఫీసులో ఘోరమైన తప్పిదం చేసింది. అది నెలరోజుల తరువాత ఇప్పుడు బైటపడింది. అందరికన్నా పై అధికారి బాధ్యులు ఎవరైతే వాళ్ళ మీద కఠిన చర్య తీసుకోమని దస్త్రం మీద రాశాడు ఆకుపచ్చ సిరాతో.

అందరూ ఆమె సస్పెండు అవుతుందన్న నిర్ధారణకు వచ్చారు. అవకాశం దొరికింది కనుక రాయుడు వదలడు అనుకుందామె. ఆ రోజు తన ఇంటికి వచ్చి దీనంగా ప్రవర్తించడం, ఇన్ని రోజులుగా తనను పిలవకపోవడం తానేదన్న రాద్ధాంతం చేస్తుందన్న భయం వలన అయుంటుంది. పశ్చాత్తాపం తెచ్చిన పరివర్తన వల్ల కాకపోయుంటే ఈ సమయం అతను ఉపయోగించుకుంటాడు.

అతనివి అపారమైన నక్క తెలివితేటలు. అదీకాక, కార్యాలయపరంగా అద్భుతమైన నిర్ణయాలు తీసుకోగలడు. కాకపోతే లంచగొండి. అదిచ్చే భయం లోపల ఉండుంటుంది. ఎవరన్నా ప్రశ్నిస్తే – నాకున్న అవకాశాన్ని వినియోగించుకుంటున్నా అంతే అంటాడు. రాయడు లంచం తీసుకోడం మానేస్తే రాయుడి పైవాడు మానేస్తాడా అంటాడు రాయుడు. అతని దగ్గిరికి వెళ్లి సహాయం అర్థిద్దామన్న ఆలోచన సుమతికి వచ్చింది. అహం అడ్డొచ్చింది.

మరో వారం గడిచింది. అతను పిలువలేదు. ఎందుకో అతను పిలిస్తే బాగుండు అనిపించింది. సస్పెన్షన్ ఉత్తరువులు రాలేదు ఏ కారణం వలననో. అలాంటి ఉత్తరువులు ఇంతకాలం ఆగవు. ఏదైనా ఉపకారం ఉంటె ఆదిమాత్రం కార్యాలయాలలో నత్తనడక నడుస్తుంది.

చివరకు అతనొకరోజు పిలిచాడు, వెళ్ళింది. అతను పిలిచినపుడల్లా అధికంగా గుండె కొట్టుకుంటుండగా ఈసారి అలా జరగలేదు ఆమెలో ఏదో తెగింపు రావడం వలన. ఈసారి కూర్చోమని మర్యాద చేశాడు. ఎవరికి అలాంటి మర్యాద అతని అధికార అహం చెయ్యనీయదు. సస్పెన్షన్ ఉత్తరం చేతికి అందించబోతున్నట్టున్నాడు మంచితనం నటిస్తూ.

"ఎండీతో పోరాడానండి. మీలాంటి కష్టపడి పనిచేసేవాళ్ళ పొరబాటుకు కఠినంగా శిక్షిస్తూపోతే ఎవరూ రిస్కు తీసుకోరు అని. చివరకు మీ మీద చర్యను తీసుకోకుండా ఉండటానికి అతి కష్టం మీద ఒప్పించాను."

రాయుడు తెలివైన అధికారి కాబట్టి పైవాళ్ళపని సులువుగా ఉండటంచేత అతని మాటకు విలువనిస్తారు వాళ్ళు.

ఇద్దరూ స్నేహితులయ్యారు ఆరోజునుంచీ. అతను తన లంచం డబ్బులతో ఐదు ఎకరాల పొలం, నాలుగు పడకగదులు ఫ్లాటు కొనడంలో ఆమె కీలకపాత్ర వహించింది. ఇద్దరూ కలిసి ఒకసారి భీమునిపట్నం వెళ్లారు.

### *8. ఉరగమర్దనం*

చిన్నప్పకి రెండే ప్రాణాలు; ఆరు కాదు. అందులో ఒకటి అతని కులం. అతని దృష్టిలో కులమూ జీవమూ ఒకటే. తిన్నడు భక్తిభావంతో కళ్ళు అర్పించినట్టు తన కులం గురించి శిరస్సును అర్పించడానికి వెనుదీయడు. రాజకీయాలలో ఉంటూ కులం బాగోగులను చూసుకోవచ్చు; కానీ పూర్తి సమయం కులానికి కేటాయించడం అసాధ్యం. అతని కుల ప్రేమ – రాజకీయాలలో పైకి రాగల తన సత్తామీది అపనమ్మకం (కులబలం ఉన్నా) – వాటి జోలికి వెళ్లనీయలేదు. రాజకీయాలకు ఆ విధంగా నువ్వులూ నీళ్లు వదిలెయ్యడం పెద్ద త్యాగంగా అతని కులం వాళ్ళు భావించి అతన్ని తమ కుల పెద్దగా, కుల సేనానిగా అక్కున చేర్చుకున్నారు. రాజకీయాల జోలికి వెళ్ళకపోవడం వలన అతను ఆర్జించగల ధనాన్ని ఎంతగానో కోల్పోయాడు; అధికారాన్ని చెలాయించే అవకాశం కొరవడింది. అందుచేత అంతో ఇంతో ఆర్జనకు అవకాశం

కలిగే వీలున్నప్పుడల్లా – నిజానికి అలాంటి అవకాశాలు మెండుగానే దాపురిస్తున్నాయి – నిర్మొహమాటంగా తన కులం వాళ్ళ నుంచీ అతను నిర్వర్తించే కార్యానుసారం వసూలు చేసుకుంటున్నాడు. త్యాగధనుడు, ప్రేమ పాత్రుడు అయినా ఆ కులశేఖరుడికి ఇతోధికంగా డబ్బు ఇవ్వడాన్కితద్వారా తమ తమ కార్యాలను చక్కపెట్టుకోడానికి కులం వారు ఆనందపడుతున్నారు. పైగా నిజాయితీపరుడు. ఒకవేళ ఏదైనా, అదీ ఎప్పుడన్నా ఒక కార్యం సానుకూలపడకపోతే డబ్బులు ఆఖరి పైసా దాకా వాపసుచేస్తాడు; పూలతో కాకపోయినా. డబ్బులిచ్చినవాళ్లు కొంతైనా మినహాయిన్చుకోమని బ్రతిమాలినా ఆ పని చెయ్యడు.

థియోడోసియస్ డోబ్ ఝాన్స్కీ (Theodosius Dobzhansky) అనే ప్రముఖ జెన్యు శాస్త్రవేత్త భారతీయ కుల వ్యవస్థ గురించి అన్నమాటలు ఎవరో ఉటంకించగా చిన్నప్ప చదివి ఎంతో మురిసిపోయాడు ఒక భారతీయుడిగా. ఛాతీ పొంగి అరవై అంగుళాల వెడల్పయింది. మనిషి మీద ప్రపంచం జరిపిన ప్రయోగాలలోకెల్లా భారతీయ కులవ్యవస్థ గొప్ప జన్యు ప్రయోగం. అందుచేత కులవ్యవస్థని ఎవరన్నా కొట్టిపారేస్తే, లెంపకాయ కొట్టినంత పని చేస్తాడు చిన్నప్ప. ఆ వ్యవస్థను మనం కాపాడుకుంటే, అది మనలను కాపాడుతుందని ఆయన నిశ్చిత అభిప్రాయం. చిత్రమేమిటంటే ప్రతి కులస్థుడు తన కులంలో పుట్టినందుకు గర్వపడతాడు; దాన్ని కామిస్తాడు. మనువు నాలుగు వర్ణాల గురించీ ప్రస్తావించాడంతే. తదుపరి కాలంలో మనం మూడువేల కులాలుగా, ఉప కులాలుగా విడిపోయాము. రాబొయ్యే కాలంలో ఆరువేల కులాలుగా ఆ మూడు వేలు వర్ధిల్లుతాయి. అన్ని కులసంఘాలు మనం పెట్టుకుని ఆయా కుల హక్కుల గురించీ పోరాడతాం. కుల గజ్జితో గోక్కోడం కాలక్షేపం, ఒకరి జుత్తు మరొకరం పీక్కుంటూ జీవిస్తాము. ఆయన అదృష్టం కొలదీ – మంచి వాళ్లకు మంచే జరుగును – కూతురూ, కొడుకూ వేరే కులాలవాళ్ళను ప్రేమించి తండ్రి ఆజ్ఞానుసారం అది మానుకుని సొంత కులంలో పిల్లలను ప్రేమించి తండ్రి ఆశీస్సులతో వివాహాలాడారు. ఒక ఆదర్శాన్ని బోధించడమే కాదు, దానికి అనుగుణంగా జీవిస్తున్నాడు చిన్నప్ప.

బైటికి ఏదో పని మీద వెళ్ళబోతూ, మరో రెండు నిమిషాలలో దివ్యమైన ముహూర్తం ఆసన్నమవుతుందని కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఇంటి ముందు బాతులా కనిపిస్తున్న, హంసలాంటి కారు సిద్ధంగా వుంది. అనంతం ఆయన కూర్చుని ఉన్న గదిలోకి అడుగుపెట్టి, నడుం ఒంచి మరీ నమస్కరించాడు. దాని స్వీకరించనట్టుగా స్వీకరించాడు. అతన్ని చూస్తే ముచ్చెమటలు పోయడం ఆరంభమయింది అనంతానికి. రూళ్ళకర్ర మీసాలున్నాయాయనికి. రూపాయి బిళ్ళంత ఎర్రటి బొట్టుంది. ఎర్ర తలపాగా ధరించాడు. కుడిచేతి అన్నివెళ్లకూ, ఎడమచేతి రెండు వెళ్లకూ దళసరి రాళ్ల ఉంగరాలున్నాయి. ఆ వేళ్ళతో మొట్టికాయపడితే చావడం తప్ప మరో మార్గం ఉండదని అనిపించవచ్చు. కుర్చీలో కొవ్వెక్కిన భీముడు కూర్చున్నట్టుంది. తెల్ల లాల్చీ తెల్లపంచెలో ఉన్నాడు.

"చెప్పు ఎందుకు నువ్వొచ్చింది; నాకు అవతల కొంపలు మునిగే పనుంది."

ఆ గొంతు అంత బలంగానూ భయంగొలిపేట్టు ఉన్న మనిషికి తగినట్టులేదు. అతని స్వరం నన్ను చూసి భయపడక్కరలేదు అని చెపుతున్నట్టు – స్త్రీ స్వరం పురుషుడిది గాను, పురుషుడిది స్త్రీది గాను పొరబడేట్టు గానూ ఉంది. దేముడు సృష్టి ఒక కళ. వెంటనే అనంతం కోలుకున్నాడు. చిన్నప్ప ఇచ్చే సమయం ఎక్కువలేదు కాబట్టి, తన ఆలోచనలు మూకుమ్మడిగా వాయిదా వేదుకున్నాడు.

"నా ఇంటి పేరు..." అని చెప్పాడు.

ఆయన ముఖంలో గంభీరత కాస్త తగ్గి ప్రసన్నతకు కాస్త చోటిచ్చింది.

"భుజంగం గారు తెలుసా?"

"తెలీదండీ," అని సిగ్గుపడ్డాడు.

"నీ ఇంటిపేరే ఆయనదీనూ. ఆ ఇంటిపేరు గలవారు చాలామంది పెద్దవాళ్లున్నారు. వాళ్ళ జాబితా నాకాద ఉంది. నీవూ బాగా పేరు తెచ్చుకోవాలి."

"తమ ఆశీస్సులుంటే అది తప్పక జరుగుతుంది," వినయంగా అన్నాడు.

“నిజానికి నేను ఇపుడు బైటికి వెళ్ళాలి. కారు సిద్ధంగా ఉండటం నీవు చూసే ఉంటావు. రెండు నిమిషాలు ఆలస్యం చేసుంటే నేను ఈ పూటకు దక్కేవాడిని కాదు. అదృష్టవంతుడివనుకుంటా. పది నిమిషాలు నీకు కేటా ఇస్తున్నా. తదుపరి వెళతాను. మన కులంవాడు కష్టంలో ఉన్నాడు; ఆదుకోడం నా ధర్మం. దైవాజ్ఞకూడా. నాకు దైవ భక్తి, భయం ఎక్కువ."

"నేను సాధ్యమైనంత తక్కువగా మీ విలువైన సమయం తీసుకుంటా మీరు ఎక్కువగా ఇచ్చినా. లేదూ మీకు మరోసారి ఎప్పుడు ఖాళీ ఉంటే అప్పుడు వచ్చి కలుస్తాను," అని లేచే ప్రయత్నం చేయబోయాడు.

"నా ఖాళీ గురించీ నీవు ఎదురు చూస్తానంటే నెలరోజులు పట్టవచ్చు నన్ను కలవడానికి. పైగా నా కులంవాడికి ముల్లు గుచ్చుకున్నంత ఇబ్బంది కలిగినా, ఆ ముల్లును, నా మునిపంటితో తీయకపోతే నిద్రపట్టదు నాకు. ముల్లును ముల్లుతోనే తీయాలనేమీ లేదు. చెప్పేసుకో."

"నా ప్రాణ మిత్రుడు ఒక కష్టంలో వున్నాడు. అతన్ని రక్షించడానికి ఒక ప్రణాళికను సిద్ధంచేశాను. దానికి మీ సారథ్యం, సాయం అవసరం."

"మన కులంవాడా?"

"కాదు," అని కృపా కులం చెప్పాడు.

అతని భృకుటి ముడిపడింది. తన కులమంటే వల్లమాలిన ప్రేమాభిమానాలు కాక, మూడు కులాలంటే ఆయనకు అనిష్టం.

"చూడబ్బాయ్! నేను నీలాంటి మన కులస్థులను కాపాడటానికి కంకణం కట్టుకున్నా; మరో కులానికి చెందిన ఎల్లాయ్ పుల్లాయ్ లకు మేలు చేయడానికి దుకాణం పెట్టలేదు. సరే, అతగాడికి నీవు సాయం చేయడం వలన నీకు ఏమన్నా లబ్ధి చేకూరుతుందా, ఎంతోకొంత డబ్బు అతను ఖర్చుపెట్టడానికి సిద్ధమేనా?"

అనంతానికి ప్రత్యక్షంగా లబ్ధి చేకూరేట్లయినా ఆయన ఊరికే సాటి కులస్థుడని డబ్బు అడగటం మానడు. చిన్నప్ప కులస్థుడు కాకపోయినా, కృపకు అనంతం ద్వారా సాయం చెయ్యడం వలన అనంతానికి పరోక్షంగా ఏ లబ్ధి చేకూరకపోయినా, తగు మూల్యం చెల్లించుకుంటే కులాంతర సాయం చెయ్యడానికి ఆయనకు పెద్ద అభ్యంతరం ఉండదని ఒక తెలిసిన వ్యక్తిద్వారా తెలుసుకున్నాడు.

"అతనికి జరిగే మేలు నాకూ తప్పక లాభాన్ని చేకూరుస్తుంది. ఆ వివరాలు తమలాంటి పెద్దలకు చెప్పడం మర్యాదగా ఉండదు. మీరు చేయబోయే సాయానికి అతను తృణమో పణమో నా ద్వారా చెల్లిస్తాడు."

"నీ మాటలు నీ తెలివితేటలను ప్రతిబింబిస్తున్నాయి. మన కులంలో ఎవరు తెలివితేటలూ ప్రదర్శించినా నా ఛాతీ ఉప్పొంగుతుంది. అది నా బలహీనత, నిజాయతి. నేను చేయవలసినదానికి, నీ మిత్రుడు ఇవ్వడానికి సిద్ధపడిన మొత్తం ఎంతో దాచకుండా చెప్పు. మరో పది నిమిషాలు నాకు ఆలస్యం అయినా నేను పట్టించుకోను; అవతల ఏ కొంపా ఈ లోపలే కూలిపోదు, నగరపాలకసంస్థ కూలగొట్టదు, తగలడదు, మహా ఐతే రాత్రిపడుకోడంఆలస్యం అవుతుంది. నేను కన్ను మూయకుండా కూడా ఇద్రపోగలను. అవతల నేను సాయం చేస్తూ గడపవలసి కాలాన్ని మరో సాయం నిమిత్తం గడుపుతాను, అంతేనా, కాదా? ఈ రెండు పనులు నా ఆదర్శానికి అనుగుణమైనవే. ఔనంటావా, కాదంటావా?"

"మీ గొప్పదనం మనవాళ్ళు చాలామంది ..."

"అసలు విషయానికి రా!"

పథకం చెప్పాడు. ఆయన చాలా ఆసక్తితో విన్నాడు. అనంతంకు చేకూరే లాభంగురించి మాత్రం అనంతం చెప్పలేదు. అది చెప్పకపోయినా ఆయన పట్టించుకోలేదు – అది వాడి శ్రాద్ధం, నా కెలా అనుకున్నాడేమో.

ఫోను ఎత్తి మాట్లాడాడు చిన్నప్ప. చాలా స్పష్టంగా అతి తక్కువ పదాలతో అవతలివ్యక్తికి చెప్పవలసినవి, చెప్పవలసినవిధంగా. అనంతానికి అబ్బురం కలిగింది. జీవితంలో ఇతరులను చూసి నేర్చుకోవలసింది ఎంతో ఇంకా వుందికదా అని బాధపడ్డాడు.

"ఎంత ఇద్దామనుకుంటున్నాడు మీ మిత్రుడు?"

ఎంతో చెప్పాడు. అతను పెదవి విరిచి, తలా అడ్డంగా తిప్పాడు. మరో మాట చెప్పాడు అనంతం. సంతృప్తిపడినట్లు కనిపించాడు. ఆ మొత్తాన్ని బల్లమీద భక్తిప్రపత్తులతో ఉంచాడు. అతను వెంటనే తీసుకోకుండా దాన్ని చూస్తూ కూర్చున్నాడు.

"నీ నేస్తం ఇంత మొత్తానికి ఒప్పుకున్నపుడు, తక్కువగా ముందు ఎందుకు చెప్పావు?"

"అతను నాకిచ్చి పంపినది మీకు నేను ముందు చెప్పినది. నా సొంత డబ్బు కలిపి తరువాత ఇచ్చాను. అతని దగ్గిర నుంచి మిగతా దాన్ని రాబట్టగలను."

"అబద్ధం ఆడటం నీవు బాగా నేర్చుకోవాలి."

ఒక పిల్లవాడిని చూసినట్టు అనంతాన్ని చూసి చిరునవ్వునవ్వాడు. ఆయన లేచి నిలబడ్డాడు. పంకా తిరుగుతోంది. అనంతం ఇచ్చిన నోట్ల కట్టలు బల్లమీదే వున్నాయి. వాటిని పట్టించుకోనట్లున్నాడాయన. తన బొడ్లో నుంచీ ఊడగొట్టిన డబ్బును అలా ఖాతరు లేకుండా ఒదిలేశాడేంటి అనుకున్నాడు అనంతం.

"ఒరే బోడిబాబూ, అయ్యగారికి పానీయం ఇవ్వు; తాగి వెడతాడు," అని అరిచాడు.

అరక్షణంలో బోడిబాబు వచ్చాడు. వాడి తలనిండా నల్లటి కీకారణ్యమంతా జుట్టుంది అస్తవ్యస్తంగా. డబ్బు కట్టలు తీసుకుని లోపలి పోయాడు.

బైటికి ఒక అడుగు వేసిన చిన్నప్ప, "అబ్బాయ్, పానీయం తాగి వెళ్ళు, తొందరపడక. నీకు ఎప్పుడు అవసరం వచ్చినా కలువు. ఏదో ధరకు తప్పక సాయం చేస్త," అన్నాడు.

"తమరు నాకు కొండంత అండ," అని అందామనుకున్నాడు. ఆ అవకాశం ఇవ్వకుండా ఆయన మెరుపులా వెలుపలకు వెళ్ళాడు.

"బోడిబాబు గారూ నేను డ్రింకులు అవీ తాగను. దాన్ని మీరు తాగేయ్యండి," డ్రింకుసీసాతో శరవేగంగా లోపలనుంచీ వొస్తున్న ఆ ఆసామితో చెప్పి బైటికి వచ్చాడు.

రాయుడి ఫ్లాటు ముందు నిలబడి కారిడార్ ఆ చివరినుంచీ ఈ చివరిదాకా చూశాడు అనంతం. జీవచ్ఛాయలేదెక్కడా.  వీడు ఉన్నాడో లేదో తెలియదు అనుకున్నాడు అనంతం. ఒకవేళ వాడు తలుపు తీస్తే, భార్యాసమేతంగా ఉంటె మరోసారి రాక తప్పదు. లేకపోతె మరోసారి రావచ్చు. జేబులోని కత్తిని తడిమిచూసుకున్నాడు. ఆ వస్తువు కొండంత బలాన్నిచ్చింది. ఆత్మా విశ్వాసాన్ని కలిగించింది. దానికి పనిపట్టవచ్చు; పనిపట్టకపోవచ్చు. కనీసం స్వీయరక్షణకు అది అవసరం. ఎవడి ప్రాణం వాడికి అత్యంత విలువైనది. దాన్ని వస్తువు అనడానికి లేదు. మరొకడిది మనకు విలువైనది కాకపోవచ్చు – కనీసం మనదానంత. అంచేత మరొకడిది ఏమై పోతున్నా మనం పట్టించుకోనక్కరలేదు. అది మనకు అడ్డురానంత వరకూ దాంతోమనకు పేచీ కూడా అంతగా లేదు.  మన ప్రాణాన్ని ఎవడు ఒద్దన్నా కాపాడుకుంటాం.  వాడు తనను చంపే ప్రయత్నం చేయడని అనుకోదలచాడు. ఆవేశం తాత్కాలిక ఉన్మాదం అని ఎవరో అన్నట్టున్నారు. హత్యచేసి తప్పించుకోడం  అసాధ్యం. కోటిమంది హంతకులలో పదిమంది కూడా అలాంటి అదృష్టవంతులుండరు. మనిషి ఏ పని చేసినా జైల్లో బతకడానికి కాదు చేసేది. పక్షికన్నా ఎక్కువగా మనిషి స్వేచ్ఛా వాయువును ప్రేమిస్తాడు. హత్య తన చేతులతో చేయడం అనంతానికి సుతరాం ఇష్టం లేదు. నిజానికి ఏ హత్యయినా లాభించాలిగాని నష్టపరచరాదు; పగ దీర్చుకోడం ఈ కోవకు రాదు. పగ హత్య చేసి మాత్రమే తీర్చుకోవాలని

లేదు. తాను హత్యకు పూనుకోకుండా అవతలి వ్యక్తి ఉరేసుకునేట్టు చేయవచ్చు చేతికి మట్టి అంటకుండా. ఇప్పుడు తానుచేయబోయే పనికి గతానుభవం రవంత లేదు. అనుభవం ఉంటేనే కానీ మనిషి హత్యచేయడం లేదా?

బొటనవేలు కాస్తా ఒణుకుతుండగా బజర్ నాలుగుసార్లు నొక్కాడు అవసరంలేకపోయినా. చాలదన్నట్టు తలుపును బాదాడు అది నేరం చేసినట్టు. తలుపు తెరువబడలేదు. అసలీ వెధవ ఉన్నాడా లేదా? అనుకున్నాడు. ఒకవేళ ఇంట్లో ఉంటే ఒకే వ్యక్తి ఉండి ఉండవచ్చు అనిపించింది. ఎవరో లోపల ఉండీ తలుపును త్వరగా తీయకపోవడం తనను అవమానించినట్టు భావించాడు అనంతం. అవమానాలకు రెచ్చిపోయే గుణం కాదతనిది. రెచ్చిపోవడాలకు పాల్పడితే కార్యాలు సిద్ధించవు, సిద్ధించవు. తలుపు త్వరగా తీయకపోవడం తనకు అన్యాయం చేసినట్టుగా కూడా అనిపించింది. ఇలాంటి జీవితం తనకు ఇవ్వబడటమే పెద్ద అన్యాయం కదా, అన్యాయం నాకు కొత్తదా అని ప్రశ్నించుకున్నాడు. తాను హత్యకు పాల్పడబోతున్నంత ఆందోళనకు గురవడంలేదుకదా? లేదు అని సమాధానం చెప్పుకున్నాడు. ఆ సమాధానం అతన్ని పరమ శాంతపరిచింది; నవ్వించింది. ఆనందానికి, దుఃఖానికి, ఉద్రేకానికి లక్ష కారణాలుంటాయి. నడిసముద్రంలో లంగరేసి ఉంచిన నౌకలా ఉంచుకోవాలి మనసును.

సుడిగాలి తోసినట్టు తలుపు తెరుచుకుంది. వెలుపల ఉన్న అనంతం వేలుకూడా చొప్పించకుండా లోపలి వ్యక్తి తలుపు సందులో కీచకుడిలా నిలబడ్డాడు. ఆ వ్యక్తి మొహం బీటురూటు ముక్కంత ఎర్రగావుంది. అనంతం ఎత్తున్నాడు లోపలి వ్యక్తి. అనంతానికి భీముడుకున్నంత బలం లేదు ఆ కీచకుడితో పోరాడడానికి. తప్పదు చావో రేవో. ఉద్రేకంలో రాయుడు నోరు విప్పడం కూడా మరిచిపోయాడు.

"మీకు ఇబ్బంది కలిగించినట్టున్నాను. అన్నిసార్లు బజరు నొక్కుండకుండా ఉండాలిసింది; అంతలా బాదవలసిన పాపమేదీ తలుపు చేయలేదు," స్నేహితుడిలా నవ్వుతూ అన్నాడు అనంతం.

అతను పళ్ళుకొరికినట్టు వినిపించింది అనంతానికి. పళ్ళు దెబ్బతింటాయి అని ఉచిత సలహా ఇద్దామనిపించి, మరీ రెచ్చిపోతాడేమోనని ఊరుకున్నాడు. సరైన సమయంలో రాలేదేమో తాను అనుకున్నాడు. ఏది సరైనది, ఏది కాదు అన్నవిషయం అతనికి అంతుబట్టలేదు. యుద్ధానికొచ్చి అవతలివాడి భావోద్రేకాల గురించీ ఆలోచించడం చవాలాయితనమవుతుందని అనిపించింది. పూజలో ఉన్నాడో, పాయిఖానాలో వున్నాడో, లైంగిక క్రియలో ఉన్నాడో పాపం అని జాలిపడే ప్రయత్నం చేశాడు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS